



# మమకారం

**— కె. రామలక్ష్మి**

భర్త ద్రోహానికి గురైనా, మౌనంగా ఆ బాధను భరించింది. ఆ భర్త ప్రతిబింబాన్ని గౌరవప్రదంగా పెంచి పెద్ద చెయ్యాలని తపించింది. కొడుకు భర్తలా కాకుండా ఓ మానవతా మూర్తిగా రూపొందుతాడని ఆశించింది. నవ జీవనానికి నాంది పలుకుతాడని ఆశించిన ఆ కొడుకు సాంఘిక వాతావరణ కాలుష్యంలో పడి, మరో బండరాయిగా మారిపోతే, ఆ తల్లి హృదయంలో రగిలే సంఘర్షణ ఏ విధంగా వుంటుంది?

"ఏమిట్రా? ఆ హడావిడి దేనికి? ఎందుకలా కుక్కేయడం! మెల్లిగా తినరా." ఇడ్లీలు గబగబా కుక్కుకుంటున్న కొడుకుని చూసి అడిగింది అన్నపూర్ణ.

తల్లికేసి తలెత్తి చూసి 'నాకు పని వుంది. నా ఫ్రెండ్స్ నా కోసం చూస్తూంటారు' అన్నాడు నోట్లోది మింగకుండానే. "అలా నోట్లో తిండి పెట్టుకుని మాట్లాడకు, పొలమారుతుందని ఎన్నిసార్లు చెప్పాలి?" కసిరి మంచి నీళ్ల గ్లాసు అందించింది.

"థ్యాంక్యూ త్యాగమయీ!" అంటూన్న భాస్కర్ కళ్లు తల్లి ముఖం మీదే వాలాయి.

తల్లి కళ్లల్లో కదలాడే బాధ చూడడం మిస్సవ్వకూడదన్నట్టున్నాయా చూపులు!

కొడుకు తనని కష్టపెట్టాలనే అలా వెటకారంగా పిలుస్తాడని అన్నపూర్ణ గ్రహించకపోలేదు. మీసకట్టు మొలవడంతో పాటు వాడికి తల్లి మీద గౌరవం తగ్గుకు రావడం చూస్తూనే వుంది. కాని మనసులోని బాధ ఎలా చెప్తుంది? తలదించుకుంది.

'అమ్మా నాకో పాతిక కావాలి. అర్జెంట్' అంటూ చెయ్యి చాపాడు.

"నిన్ననేగా యిచ్చాను. అయినా ఆదివారం పూట ఎక్కడికి యీ హడావిడి? ఇంటి పట్టున వుండకూడదా?" వాడు చెయ్యి కడిగిన ప్లేటు తీస్తూ అంది.

"ఏం చెయ్యాలి? అయినా ఇలా ఆడదాని సంపాదన తింటూ కూర్చోడం నా కిష్టం లేదు. ఇంకో చోట పని వుందన్నారు చూస్తాను" బూట్లు వేసుకుంటూ చెప్పాడు.

అలా బూట్లు వేసుకుంటూంటే భాస్కర్ కళ్లు చిలిపిగా ఏదో వూహ వచ్చినట్టు మెరిశాయి.

తల్లి ముఖంలోకి కుతూహలంగా చూస్తూ "అమ్మా ఒక ఐడియా. అమ్మాయిల వ్యాపారం చేస్తే నాకు సరిగ్గా తగినట్టు వుంటుంది కదూ?"

"ఛ ఏం మాటలవి—మెకానిక్‌వి అయి నీకు పనే దొరకదా?"

"ఇదేపనా? ఎవరి మోటార్ సైకిలు రిపేరు కొస్తే అది రెండు రోజు లెక్కి తిరగడం ఒక అదృష్టమా? తంతే అదృష్టం రపీమని తన్నాలి! ఏమంటావు?" వెకిలిగా చూస్తూ అడుగుతున్న కొడుకు మాటలకి కళ్ల నీళ్లు సుడి తిరిగాయి అన్నపూర్ణకి. లోపలికి వెళ్లి ఓ పాతిక రూపాయలు తెచ్చి భాస్కర్ ముందు పడేసింది. వాటిని ఆత్రంగా జేబులో కుక్కుకుంటూ "బై, నా కోసం ఎదురు చూడకు. ఆలస్యం కావచ్చు." అంటూ రెండేసి మెట్లు దిగి—మోటార్ సైకిల్ ఎక్కేశాడు. కిటికీలోంచి చూస్తూ నిలబడింది అన్నపూర్ణ. ఆ సైకిల్ రొద భూకంపంలా తోచింది. 'ఛ. ఏం కుర్రాళ్లో... ఎందుకింత ఆనందం వీళ్లకి?.... యీ చప్పుడులో ఏముంది!' కోపం, కసి లాంటివి మనసులో ఉవ్వెత్తున లేస్తూన్నా వాటిని అణచుకుంటూ—"నా పై కాక ఎవరిమీద చూపిస్తాడులే— ఆ సైకిల్ మీద కాక!" అనుకుంది నిట్టూరుస్తూ.

అన్నపూర్ణ చాలా సేపు అలాగే నిలబడిపోయింది. శూన్యం మనస్సు, శూన్యం సర్వం. కళ్లు గుడ్డిగా శూన్యంలోకే చూస్తున్నాయి.

ఆ మనసు ఏం ఆలోచిస్తోందో ఆమెకే తెలియదు.

"ఏమిటి పూర్ణా, తెగ ఆలోచిస్తున్నావు? లేక నీ కొడుకు లేపిన ధూళిలోంచి చూడాలని ప్రయత్నిస్తున్నావా?" నవ్వుతూ భుజం మీద చెయ్యి వేశారు—పిన్నిగారు.

ఉలిక్కిపడి ఆమె కేసి తిరగడానికి ముందు కళ్లు తుడుచుకుంది అన్నపూర్ణ. నీళ్లు జారక నీళ్లు నిండిన కళ్లు వర్షించని మేఘాల్లాగా వున్నాయి. నీటి వెనుక నుంచి కళ్లు మెరవడం లేదు.

'ఏం లేదు పిన్నిగారూ... ఒంట్లో బాగుందేమిటి? మెట్లెక్కి చక్కా వచ్చారు?' నవ్వడానికి ప్రయత్నించింది అన్నపూర్ణ. కాని ఆమె కంఠం దుఃఖంతో వణకడం పిన్నిగారు గ్రహించారు.

'ఏమిటీ? పుత్ర రత్నం మళ్లీ ఏం చేశాడు?" భుజం గట్టిగా నొక్కుతూ అడిగారు. ఆ ఒత్తిడిలోని ఆప్యాయత, అభిమానం, గుండెలో గూడుకట్టుకున్న దుఃఖానికి కట్టలు తెంచింది. ఆమె భుజం మీద వాలిపోతూ భోరున ఏడ్చింది అన్నపూర్ణ. ఓ ఐదు నిముషాల పాటు చిన్ని గదిలో అన్నపూర్ణ దుఃఖం మినహా యితర శబ్దం లేదు.

'కళ్లు తుడుచుకో పూర్ణా. ఇదేం కొత్తా నీకు?.... వాడు నీ గర్భాన పుట్టిన శత్రువుగాని కొడుకు కాదు. వాడలా తయారవుతాడని—నీ కెన్నిసార్లు చెప్పలేదు? ఎన్నేళ్ల క్రిందట చెప్పలేదు? పిచ్చిదానా, చెయ్యి దాటి పోయాడు వాడు. ఇక వాడిని వదిలెయ్. పద. నాకూ కాస్త టిఫిన్ పెట్టు" అంటూ వెను తిరిగారు పిన్నిగారు.

"మీరింకా ఏం తినలేదా? అయ్యో.... పదండి." అంటూ గబగబ రెండు పళ్లాలలో యిడ్లీలు సర్దింది అన్నపూర్ణ. తనకి తినాలని లేకపోయినా... పిన్నిగారి కోసం తినాలి. ఆమె తన పాలిటి తల్లి, దైవం, సర్వస్వమూ. ఆమె లేకపోతే బ్రతకలేక పోయేది. 'తిను పూర్ణా నువ్వు తిండిమాని వాడిని బాగు చెయ్యలేవు. ఏడిచి వాడిని మార్చలేవు... వాడిని నిర్లక్ష్యం చేస్తే బాగు చెయ్యగలవు. యిల్లు వదిలి పొమ్మంటే బాగు చెయ్యగలవు!" కాస్త కోపంగా అన్నారు పిన్నిగారు. ఆమె కళ్ల దాకా ఎగప్రాకని ఆ ధర్మ కోపానికి కాస్త నవ్వొచ్చింది అన్నపూర్ణకి.

"పూర్ణా జ్ఞాపకం వుందా? నువ్వు ఏదైనా పని యిప్పించమని వచ్చినప్పుడు వాడికి నాలుగేళ్లు కూడా లేవు.... నాకు ఓ అవిటి తమ్ముడు, నా రక్తపోటూ తప్పించి ఎవరూ లేరు. నీకూ నాకూ సహాయం అనుకున్నాను నిన్ను చేరదీసినప్పుడు."

"ఎన్నేళ్ల క్రిందటి మాట? ఇప్పుడెందుకవి? ఈ రోజు మీకసలు బాగులేదు ఒంట్లో—నన్ను పిలిస్తేరానా?" బాధగా అంది అన్నపూర్ణ.

"వస్తావు. కాని నాకే నిన్ను చూడాలనిపించింది... భాస్కర్ వెళ్లిన దూకుడు చూసి... వాడేదో అనే వుంటాడనిపించింది...." నిట్టూర్చారామె.

"వీడెందుకిలా తయారయ్యాడు? నేనేం అపకారం చేశాను వాడికి?" బాధగా అడుగుతున్న అన్నపూర్ణ కేసి ఆప్యాయంగా చూస్తూ "నీకు తెలియదా?" అన్నారు.

తలదించుకుంది అన్నపూర్ణ. తన మీద తన కొడుక్కి రవంత గౌరవం గాని అభిమానంగాని లేదని ఏ తల్లి ఒప్పుకుంటుంది? మౌన ముద్ర దాల్చి వూరుకుంది.

"పూర్ణా! ఎందుకిప్పుడా దిగులు... పోనీలే—పోతే పోనీ వాణ్ని... నేను లేనా నీకు....' ఆ మాట అంటూంటే నవ్వొచ్చింది పిన్నిగారికి.

"ఎందుకానవ్వు. మీరున్నారు నాకు. వుంటారు—పది కాలాలపాటు!" ఆమె చెయ్యి ఆప్యాయంగా అందుకొంది అన్నపూర్ణ....

ఇలాగే ఓ పదేళ్ల కిందట పిన్నిగారు అన్నపూర్ణ చెయ్యి అందుకుని బ్రతిమాలుతూ నచ్చచెప్పాలని చూశారు.... 'నా తమ్ముడు అవిటివాడని చూడకు పూర్ణా, వాడి మనసు బంగారం. వాడికి పెళ్లాం కావాలి. ఎందుకో తెలుసా? వాడి మనసు విప్పి మాట్లాడుకోడానికే... నీకు ఓ మగతోడు కావాలి. నా మాట విను. మీకిద్దరికీ పెళ్లి చేస్తాను. భాస్కర్ బాధ్యత ఇద్దరూ పంచుకుందురు గాని. మగ పిల్లలు ఆడపిల్లల్లాగా కాదు పూర్ణా. వాళ్లు తల్లిని మరిచిపోతారు ఇట్టే. నే చూడు. నల్గుర్ని పెంచాను. ఏమైంది? రెక్కలు వచ్చి ఎగిరి పోలేదూ? మళ్లీ ఒంటరి కట్టెని మిగిలాను.... నీకు తెలిసినదే కదా! నీ కళ్లతో నువ్వు చూసినదే కదా? నా తమ్ముడు తిరగలేడు. నా యింట్లో వాడిని పెట్టుకుని పోషించడానికి... ఎన్నెన్ని అభ్యంతరాలు ఎదుర్కొన్నాను? అయినా వాడిని నేను వదలలేక పోయాను. వాడిని నాకు అమ్మ అప్పగించి పోయింది. వాడికి డబ్బుకి లోటు లేదు, ఆత్మీయతకి తప్ప. అది ఎవరందించారు! నువ్వు కదూ! పసివాడికి చేసినట్టు చేశావు.... కాని పెళ్లి అనే సరికి.... కాదన్నావు! ఇప్పుడు చూడు... వాడూ లేడు, వీడూ లేడు—నీకు. వీడి కోసం కదూ నువ్వు పెళ్లి సంగతి తలపెట్టనిది?" అని అడుగుతున్న పిన్నిగారు.... మనసులో సుళ్లు తిరిగి పోతూన్న ఆలోచనలు. భాస్కర్... తెలిసీ తెలియని జ్ఞానం. తను పెళ్లి చేసుకుంటే ఏమనుకుంటాడు? తనని అమ్మని గౌరవించినట్టు గౌరవిస్తాడా? ఊహుఁ తనా వూహ కూడా భరించలేదు. "నన్నిలాగే వుండిపోనివ్వండి పిన్నిగారూ, నాకింకేం వద్దు—మీ అభిమానం తప్ప" అని తన నిర్ణయాన్ని చెప్పి తప్పించుకుంది. అయినా పిన్నిగారూ మారలేదు. ఆమె తమ్ముడూ మారలేదు.

"పూర్ణా అక్కయ్య పిచ్చిది. నువ్వేం అనుకోకు." అంటూ మంచంలో పడుకునే ఆమె అడిగినందుకు క్షమించమన్నట్టు వేడుకున్న తమ్ముడు. "ఓ! భగవాన్... ఎంత మంచి మనుషుల మధ్యకి విసిరావయ్యా నన్ను!" అనుకుంధి అన్నపూర్ణ.... జ్ఞాపకాల కెరటం విరిగి వెనక్కి లాగుతున్న నీళ్ల లాగా కాళ్ల కిందనేల జారుతున్నట్టు అయింది.

'ఏమిటి పూర్ణా? ఇంకా వాణ్ని గురించేనా ఆలోచనా?" చెయ్యి నొక్కుతూ యీ వర్తమానంలోకి లాగిపడేశారు అన్నపూర్ణని.

'ఆఁ' అంటూ ఉలిక్కి పడింది అన్నపూర్ణ. ఇప్పుడామె కళ్లు వర్షిస్తున్నాయి... గతించిన గతం కోసమా? చేజారిపోతున్న వర్తమానం కోసమా—ఆమెకే అర్థం కావడం లేదు.

"మగపిల్లలు ఇట్టే ఎదిగిపోతారు పూర్ణా. వాళ్లకి తల్లి అవసరం వుండదు. యిక వాడి బాధ వాడిని పడనియ్యి..."

"వాడెక్కడికి వెడుతున్నాడో... ఏం చేస్తున్నాడో—వాడి స్నేహితులెవరో..." ఏదో అనబోయి ఆగింది. "మనకెందుకు? అదే వాడూ అడుగుతాడు పూర్ణా—వాడికి డబ్బుకావాలి. ఇల్లు యిచ్చే విశ్రాంతి కాస్సేపు కావాలి. అంతే గాని నువ్వూ నేను కాదు. అమ్మమ్మా! అంటూ పలకరించే ఆ చిన్ని భాస్కర్ కోసం నేను చూడ్డం మానేశాను... నువ్వు కూడా మరిచిపోతే కాస్త మనసుకేనా విశ్రాంతి.... జ్ఞాపకం పెట్టుకో. పని పూర్తి చేసుకు కిందికిరా... " అంటూ చెయ్యికడుక్కుని మెట్ల కేసి నడిచారు పిన్నిగారు.

నెమ్మదిగా ఒక్కొక్క మెట్టే దిగుతున్న పిన్నిగారినే చూస్తూ ప్లేట్లో చెయ్యికూడా తీయడం మరిచి వుండిపోయింది అన్నపూర్ణ. "ఈమే లేక పోతే నేను పిచ్చిదాన్ని అయిపోయే దాన్నేమో" అనుకుంటూ ఓనిట్టూర్పు విడిచింది....

ఓ మిషన్‌లాగా యింట్లో తిరుగుతూందే కాని అన్నపూర్ణ మనస్సు గూడు కట్టిన గొంగళి పురుగులాగా అక్కడికక్కడే గిలగిల లాడుతోంది. చేసిన పనే చేస్తూ, కడిగిన గిన్నెనే కడుగుతున్నా ఆమె మనసు—భాస్కర్ ఎక్కడికి వెళ్లాడు? వాడెందుకలా అన్నాడు? పిన్నిగారితో వాడన్న మాట చెప్తే—ఎంత బాధ పడుతుందామె?... ఏమిటో పిచ్చి ఆలోచనలు... నిస్సత్తువుగా వాలు కుర్చీలో కూలబడి కళ్లు మూసుకుంది అన్నపూర్ణ. ఆమె పిచ్చి మనసు ఆమె కళ్ల ఎదుట నిలబడి "మోసగించిన మగాణ్ని వదులుకున్న నువ్వు వాడి సంతానాన్ని ఎందుకింత ప్రేమించావు?' అని అడుగుతోంది. అలా ఎంత సేపు పడుకుందో.... సాయంత్రపు చల్లగాలి ముఖానికి తగిలి లేచింది అన్నపూర్ణ. శరీరం మనసూ ఒకేలా అలసి పోవడంతో... ఎక్కడుందో తెలియకుండా నిద్ర పోయింది. ఆ నిద్రలో గతం తిరగతోడింది. కాని కళ్లు తెరిచేసరికి... గతంలేదు... చుట్టూ ఎర్రని వెలుగు. నీరెండ. సంధ్యా సమయం... గబగబ లేచి ముఖం కడుక్కుని ఓ ఆరేసిన చీర కట్టుకుని క్రిందికి వెళ్లింది—పిన్నిగారికి కాస్త భోజనం వండి పెడదామని.

ఆ కబురూ ఈ కబురూ తప్ప ఇద్దరూ భాస్కర్ ప్రసక్తి తేకుండా కాలక్షేపం చేశారు చాలా సేపు. కాని ఇద్దరి మనసుల్లోనూ.... వాడే విస్తరించి వున్నాడు—కంటికి తెలియకుండా పరచుకున్న చీకటిలాగా!

"ఇంకా రాలేదేమిటి వీడు?" అన్నారు చివరికి పిన్నిగారే. "వేషానికేం లోటు లేదు. ఆ బూట్లూ, ఆ జెర్కినూ,

మరీ సినిమాల్లో విలన్ కొడుకులాగే తయారయ్యాడు వాడు!" మళ్లీ ఆవిడే అన్నారు.

నిజమే. ఎంత వద్దనుకుంటున్నా అన్నపూర్ణకి. కొడుకుని చూస్తున్నంత సేపూ తనని నమ్మించి గొంతు కోసిన వాడి తండ్రి జ్ఞాపకానికి వస్తున్నాడు. ఆ మాట తీరు, ఆ నడక తీరు అంతా... తండ్రిదే. తండ్రి అని ఎలా అంటుంది?... బాధ్యత వంచుకోని వాడిని! తననే దోషిగా నిలబెట్టారంతా... ఏం చేస్తుంది? దోషాన్ని మోసుకుంటూ పాప ఫలితం అప్పటి నుంచి ఇప్పటి దాకా అనుభవిస్తూ వస్తోంది. తనని మోసం చేసిన వాడి దోషం తన గర్భాన పెరుగుతున్న వాడికెలా అంట గట్టను? నోరూ వాయీ లేని పసికందు తప్పేముంది అనుకుంది అన్నపూర్ణ. కాని ఆ పసికందు తనలా మానవత్వంతో మూర్తీభవించుతాడని ఎలా ఎదురు చూశాను? అని నవ్వుకుంది.

"వాడు రానీ, నువ్వు మాట్లాడకు. నేనే గట్టిగా గడ్డి పెడతాను.... తల్లినిలాగా క్షోభ పెట్టడం?" కోపంగా అన్నారు పిన్నిగారు.

'వాడిది క్షోభ పెట్టడం అనుకోడం లేదే! వాడికిదో కిరాతకానందం కల్గిస్తోందే. ఈ సంగతి మీకెలా చెప్పను!' మనసులోనే అనుకుంది అన్నపూర్ణ.

బాగా చీకటి పడి పోయింది. హాల్లో గోడ గడియారం అరగంట కొట్టింది. 'అయ్యో... ఎనిమిదిన్నర... మీరు రొట్టితిని పడుకోండి' అంటూ గబగబ రెండు చపాతీలు వత్తడానికి వంట గదిలోకి పరుగెత్తింది అన్నపూర్ణ.

రొట్టెలు తిని కాస్త మజ్జిగ తాగి మాత్ర వేసుకుని మంచం మీద నడుము వాల్చారు పిన్నిగారు. ఆమె కాళ్లు రాస్తూ అలాగే కూర్చుండి పోయింది అన్నపూర్ణ.

గోడ గడియారం, గంటలూ అరగంటలూ కొడుతూనే వుంది. హాల్లో అది చేస్తున్న అలికిడి, సన్నగా పిన్నిగారు తీస్తున్న గురక తప్ప మరేం వినబడడం లేదు.

ఎటునుంచైనా మోటర్ సైకిల్ చప్పుడు యీ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వస్తుందా అని చెవులు రిక్కించి వింటోంది అన్నపూర్ణ. చెవులకి కంటక ప్రాయంగా వుండే ఆ చప్పుడిప్పుడు అమృతపు జల్లులాగా విన్పించేలా వుందామెకి. కాని నిశ్శబ్దం—ఇంట్లోనూ బయటా భరించలేనంత నిశ్శబ్దం.

• • •

ఫోను మ్రోగుతోంది. ఎప్పుడు నిద్రలోకి జారుకున్నదో అన్నపూర్ణ ఆ చప్పుడుకి ఉలిక్కిపడి లేచింది. ఆ చీకట్లో తడుముకుంటూ ఒణుకుతున్న చేత్తో ఫోను ఎత్తింది. ఏదైనా ప్రమాదం జరగలేదు కదా...

'మిసెస్ త్యాగమయా!' ఫోనులో మగవాని కంఠం.

"ఎవరు? ఎవరు మాట్లాడేది భాస్కర్?" ఆత్రంగా అరిచింది. ఆ అరుపుకి పిన్నిగారు లేచి కూర్చున్నారు. "కాదు. నేను ఇనస్పెక్టర్‌ని. మీ వాడీ ఫోను నెంబరు ఇచ్చాడు. మీతో ఒక్క మాట మాట్లాడాక మేం అతణ్ణి స్టేషనుకి తీసుకెళ్తున్నాం. టూ టౌన్ పోలీస్ స్టేషన్. రేపు ఉదయం వచ్చి మీరు చూడండి" అతని మాట కట్ చేస్తూన్నట్టు మధ్యలో భాస్కర్ ఫోను లాక్కున్నట్టుంది.

"కబుర్లు చెప్తావేంటి? నన్ను వదలమని చెప్పు. నన్ను వీళ్లు కొట్టారు? నన్ను జైల్లో పారేస్తారు" దరిదాపు ఏడుస్తున్నట్టుంది భాస్కర్ కంఠం.

"నాయనా భాస్కర్.... ఏమైందిరా?" ఏడుస్తూనే అడిగింది.

"ఏడుస్తూ కూర్చుంటావా? ఏమైనా చేస్తావా?" కసిరాడు. "నేనొక్క రాత్రి కూడా జైల్లో వుండలేను."

"సారీ మేడమ్. మీరు రేపు ఉదయం రండి" అంటూ టక్కున ఫోను పెట్టేశాడు ఇన్‌స్పెక్టరు.

రాతి బొమ్మలాగా నిలబడి పోయింది అన్నపూర్ణ. "ఏమైంది పూర్ణా, ఎవరు? భాస్కరేనా?" ఆత్రంగా అడుగుతున్న పిన్నిగారి దగ్గిరికి, పరుగున వెళ్లి పడింది—ఆమె ఒడిలో పడి భోరున ఏడుస్తూ "చూశారా నాపేరు త్యాగమయి అని చెప్పాడు పోలీసులకి. ఏమైందో... రేపు ఉదయం వచ్చి చూడమన్నారు ఇనస్పెక్టర్.... వాడు... వాడు ఏడుస్తున్నాడమ్మా..."

"నువ్వు మటుకు ఏడవడం లేదా అన్నపూర్ణా. తెల్లవారనీ చూద్దాం..."

"ఎప్పుడు తెల్లవారుతుంది? నేను వాడినెప్పుడు చూస్తాను?' ఏడుస్తూనే అడిగింది అన్నపూర్ణ. ఆ వంగిన తలరాస్తూ ఓదారుస్తూ కూర్చున్నారు పిన్నిగారు.

ఉదయం స్టేషనులో జరిగింది తెలుసుకుని నిర్ఘాంత పోయారు ఇద్దరూ.

"ఎస్ మేడమ్. పబ్లిక్‌గా డబ్బు పుచ్చుకుని ఓ అమ్మాయిని వీళ్లు అమ్మకానికి పెట్టారు. నల్గురు పారిపోయారు. వీడు పట్టుబడ్డాడు. పోలీసుని కొట్టాడు. పారిపోయిన వారిలో ఒకడు కత్తితో ఓ ఆఫీసర్ని పొడిచాడు కూడా. యిదో గ్యాంగు, గుండెలు తీసిన రకం... సారీ, వీడు మీ కొడుకు కావడం బాధగా వుంది. కేసు పెడుతున్నాం... మీరు కావలిస్తే..."

"నో. నో. నన్ను యీ నరకంనుంచి విడిపించు అమ్మా. నేనొక్క క్షణం యిక్కడ వుండలేను." కస్టడీ రూం లోంచి అరుస్తున్నాడు భాస్కర్.

దగ్గిరగా వెళ్లింది అన్నపూర్ణ. "నేను మంచి లాయర్ని చూస్తాను భాస్కర్. అమ్మమ్మ నిన్ను యిలా వదిలెయ్యదు కాస్త ఓర్పు తెచ్చుకో."

"ఓర్పా? ఇక్కడ వుండి చూడు నీకు తెలుస్తుంది!... నన్ను తక్షణం విడిపించకపోతే—నీ ముఖం నాకు చూపించకు!" అంటూ ముఖం పక్కకి తిప్పుకున్నాడు భాస్కర్.

"అవునురా, త్యాగమయి కదూ మీ అమ్మ. తక్షణం విడిపించే ప్రయత్నం చేస్తుంది. కాని ఏం లాభం నువ్వు చేసిన పని ఏ తల్లి కన్న కొడుకూ చెయ్య కూడనిది. నీ తల్లి త్యాగానికి నువ్విచ్చే బహుమతి యిదా?.... ఛ.... నువ్వా కొడుకువి. రా పూర్ణా. లాయర్ని మాట్లాడి..." అంటూ అన్నపూర్ణని చేయిపట్టి బయటికి నడిపించారు పిన్నిగారు.

'అమ్మా!' అన్న వాడి కేక... నేలబడి రాపాడుతున్న తన పచ్చి గుండెకి ముల్లులాగా గుచ్చుకుంది అన్నపూర్ణకి.... కాని... తన త్యాగాన్ని అవహేళన చేసిన భాస్కర్ ముఖం కేసి చూడాలనిపించక దృఢంగా అడుగులు వేస్తూ పిన్నిగారి వెనక నడిచింది. □

## భావకదంబం

మూడుముళ్లు వేయించారుగా. అంతవరకూ శాస్త్రం చాలులెండి. మనం అటు పూర్తిగా సనాతనం కాదు. ఇటు అధునాతనం కాదు. రెండు పద్ధతులూ పట్టుకుని వేలాడతాం!

—యద్దనపూడి సులోచనారాణి (నవల:అభిశాపం)

ఇంటింట దీపంబు వెలుగుతుండాలె. కలహాలు యింటింట కలుగుతుండాలె. సట్టింట పుయ్యాల కట్టి తీరాలె. కాంతంతో కలహంబు పట్టి తీరాలె. పిల్లలూ లేనట్టి ఇల్లేమి ఇల్లు. పోట్లాటలేనట్టి పొత్తేమి పొత్తు.

—మునిమాణిక్యం (కథ: ఇంటావిడతో పోట్లాట)

తెలివి మీరిపోయిన ఇడియట్స్ ఈజీగా లొంగుతారు. తెలివిమీరిపోతే, డబాయింపు సెక్షన్, జులుం పనికిరాదు. అయితే ఏం చేయాలి? ఆకర్షించి మోసం చేయాలి లేక మోసం చేసి ఆకర్షించాలి.

—రా.వి.శాస్త్రి (కథ: అగ్గిపుల్ల)

ఆకూ వక్కా కలిపి నమిలితే నోటికి అందం. భార్యా భర్తలు ఆకు వక్కలాంటివారు. అట్లాగే మనసుల్ని కలుపుకోవాలి. అదే దాంపత్య జీవితం.

—హరికిషన్ (నవల:దాంపత్యయుద్ధం)

మానవత్వంలో వుండే మహత్యాన్ని చాటడానికే రచనలు. వాటిని నిర్లక్ష్యం చేశాక, వ్యర్థం అనుకున్నాక—ఇక సాహిత్యపు సత్పరిణామం ఏముంటుంది? మానవజీవిత చైతన్యానికి రచనలు కాని, రచనల కోసం దాన్ని స్తంభింపచేయడం కాదు.

—చక్కిలం విజయలక్ష్మి (నవల: ఈ రాగానికి అదే తాళం)

సేకరణ: అట్లూరి చౌదరాణి